క్లుప్తంగా

నేడు శ్రీహనుమాన్ చాలీసా అఖండ పారాయణం

సింగరేణి(కొత్తగూడెం): విశ్వావసు నామ సంవత్సర వైశాఖ బహుళ దశమి గురువారం హనమత్ జయంతి సందర్భంగా సీఎంపీఎఫ్ కార్యాలయం వద్ద గల దాసాంజనేయ స్వామి ఆలయంలో విష్ణు సహస్ర నామ స్తోత్ర ,శ్రీహనుమాన్ చాలీసా అఖండ పారాయణం 12 గంటల పాటు (ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు జి.నాగేందర్ బుధవారం తెలిపారు. సర్వజన సంక్షేమానికై నిర్వహించే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

‘ప్రైవేట్’లో ఫీజులను నియంత్రించండి..

పాల్వంచ: ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని పాల్వంచ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ... అన్ని విద్యాసంస్థల్లో ప్రమాణాలను, నాణ్యతను పెంపొందించే విధంగా ప్రస్తుతం ఉన్న చట్టాలకు సవరణ చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాలు కూడా తమ వద్దే కొనాలని నిబంధనలు పెడుతూ అధిక రేట్లకు అమ్ముతున్నట్లు చెప్పారు. రామ్ మెహతాబ్, సైపుల్లా, పండు, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

జీవజాతులను రక్షించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రకృతిలో జంతుజాలాలు, క్షీరదాలు, పక్షులు, ఉభయచరాలు వంటి వాటిని రక్షించుకోవాల్సిన అవసరముందని గ్రీన్ వారియర్ జీవీఎస్ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా జీవ వైవిధ్యంపై ప్రతీఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రపంచంలో జీవ వైవిధ్యం అధికంగా ఉన్న 12 దేశాలలో భారతదేశం ఒకటిగా ఉందని, అభివృద్ధి పేరిట అడవులను నరికివేయడం వలన అందులో జీవించే ప్రాణులు జనావాసాలకు చేరుతున్నాయని, ప్రకృతిపై ఆధారపడిన జీవులతో చెలగాటం ఆడరాదని పేర్కొన్నారు. జీవ వైవిధ్య వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు.

నకిలీ విత్తన విక్రయదారులపై చర్య తీసుకోవాలి

ఇల్లెందురూరల్: వానాకాలం ప్రారంభం కావడంతో నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయని, విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు బుధవారం వ్యవసాయశాఖ అధికారి సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భావ్ సింగ్ మాట్లాడుతూ.. జీలుగు, జనుము విత్తనాలను వ్యవసాయశాఖ గతేడాది కంటే అధిక ధరలకు విక్రయించడం దారుణమన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు వేసి నేలసారాన్ని పెంచుకోవడంలో రైతుకు సహకరించాల్సిన ప్రభుత్వం ధరలు పెంచడం అన్యాయమన్నారు. ప్రసుత్తం బహిరంగ మార్కెట్‌లో కొత్తకొత్త పేర్లతో విత్తనాలు వస్తున్నాయని, వాటిలో నకిలీలను గుర్తించడం రైతులకు సాధ్యం కాదని, విక్రయ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించి అరికట్టాలని కోరారు. కాసాని హరిప్రసాద్, దరావత్ రమేష్, రమేష్, హుస్సేన్, రాందాస్, చినబాబు, ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకుంటే ఓసీని అడ్డుకుంటాం..

ఇల్లెందురూరల్: 21పిట్ ఏరియాలో సింగరేణి వల్ల నెలకొన్న సమస్యలను వివరిస్తూ అఖిల పక్ష కమిటీ బుధవారం జీఎంకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేకే ఓసీ విస్తర్ణ ప్రాజెక్టులో వ్యవసాయ భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, ఓసీ తీసే ప్రాంతం మినహా మిగిలిన సింగరేణి క్వార్టర్లు, సొంత ఇళ్ల భూమిని రెవెన్యూకు అప్పగించాలని, ఓసీ ప్రభావిత ప్రాంతంలో సింగరేణి సంస్థ ద్వారా తాగునీరు అందించాలని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నబీ, పూనెం సురేందర్, వెన్నంపల్లి శ్రీనివాస్, ఎట్టి హరికృష్ణ, క్లింట్ రోచ్, సదరం మహేష్, టి.లాలు, ధనరసి రాజు, మాచర్ల విజయ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

దళారులను కట్టడి చేయాలి

కొత్తగూడెంఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువత కొరకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులో దళారులను కట్టడి చేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ. యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగ యువత కోసం ప్రవేశపెట్టిన కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నప్పుడు దళారులు నేరుగా వారి వద్దకు వెళ్లి రుణాలు విడుదల కాకముందే 40 శాతం కమిషన్ ఇచ్చేలా ముందస్తుగా ఒప్పందం చేసుకున్న తర్వాతే లబ్ధిదారుల ఎంపిక చేశారని తెలిపారు. యూనిట్ల మంజూరులో, లబ్ధిదారుల ఎంపికలో కీలకంగా వ్యవహరిస్తున్న ఎస్సీ. ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులకు తగిన విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

బీటీ రోడ్డు పనులకు గ్రహణం..

- ఐదు నెలల క్రితం శంకుస్థాపన
- ఇబ్బంది పడుతున్న మూడు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు

జూలూరుపాడు: మాచినేనిపేటతండా (హరిజనవాడ)– తవిసిగుట్ట తండా గ్రామాల మధ్య బీటీ రోడ్డు పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఐదు నెలల క్రితం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన జరిగినప్పటికీ పనులకు మోక్షం కలగడం లేదు. తవిసిగుట్ట తండా – మాచినేనిపేట తండా గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి ఎస్టీఎస్డీఎఫ్ నిధులు రూ.కోటి ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో రహదారి నిర్మాణ పనులకు డిసెంబర్ 3, 2024న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఐదు నెలలుగా ఎలాంటి పనులు చేపట్టలేదు. బీటీ రోడ్డు మంజూరుతో తవిసిగుట్ట తండా ప్రజలు ఎంతో సంతోషపడ్డారు కానీ, పనుల జాప్యం కారణంగా నిరాశకు గురవుతున్నారు. తవిసిగుట్ట తండా నుంచి మాచినేనిపేట తండా వరకు మట్టి రోడ్డుతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై నడిచే పరిస్థితి కూడా ఉండదు. తవిసిగుట్ట తండా ప్రజలు కరివారిగూడెం కాలనీ, కొమ్ముగూడెం గ్రామాల మీదుగా మండల కేంద్రం జూలూరుపాడు చేరుకోవాలంటే దూరంతోపాటు, సమయం పడుతుంది. ఈ రెండు గ్రామాల మధ్య రహదారి నిర్మాణం పూర్తయితే దూరం తగ్గడంతోపాటు, తక్కువ సమయంలో జూలూరుపాడు చేరుకోవచ్చు. ఈ రహదారి తవిసిగుట్ట తండాతోపాటు, కరివారిగూడెం, కరివారిగూడెం కాలనీ ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. బీటీ రోడ్డు నిర్మించడం వల్ల మాచినేనిపేట తండా, హరిజనవాడ కాలనీ, కొమ్ముగూడెం, కరివారిగూడెం తదితర గ్రామాలకు చెందిన రైతులు, కూలీలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై జూలూరుపాడు పీఆర్ ఏఈ కార్తీక్‌రెడ్డిని వివరణ కోరగా... టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు.


తవిసిగుట్టతండా- మాచినేనిపేటతండా మట్టి రోడ్డు


శిలాఫలకం

రహదారి పనులు పూర్తి చేయాలి..



బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించ లేదు. తవిసిగుట్ట తండా నుంచి మాచినేనిపేట తండా మధ్య రహదారి నిర్మాణం పూర్తైతే మా కష్టాలు తీరుతాయి. వర్షాకాలం ప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాలి. – బోడా దేవా, తవిసిగుట్ట తండా

పనులు ప్రారంభించాలి..



ఐదు నెలల క్రితం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదు. గతంలో కూడా కరివారిగూడెం నుంచి వయా తవిసిగుట్ట తండా మీదుగా మాచినేనిపేట తండాకు రహదారి మంజూరైనా పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. – వీర్ల రమేష్, కరివారిగూడెం

ఎన్నో ఏళ్ల కల నెరవేరనుంది..



తవిసిగుట్ట తండా నుంచి మాచినేనిపేట తండాకు రోడ్డు లేక అవస్థలు పడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం రహదారి మంజూరు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తే ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న కల నెరవేరుతుంది. – బోడా ప్రసాద్, తవిసిగుట్ట తండా

‘సీతారామ’తో నీటి కష్టాలు దూరం

పాల్వంచరూరల్: ఈ ప్రాంత రైతులకు నీటివనరులు ఉపయోగపడేలా సీతారామా ప్రాజెక్టు కాలువల నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగారంకాలనీ, రంగాపురం, దంతలబోరు, ఎస్సీ కాలనీ, సంఘం గట్టు, నారాయణరావుపేట, నాగారం, తోగ్గూడెం, జగన్నాథపురం, సోములగూడెం తదితర గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా రూ.4.49 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి పథకాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నాటి పాలకుల అనాలోచిత విధానాల వలన గోదావరి జలాలు ఈ ప్రాంత ప్రజలకు అందకుండా పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఈ సమస్యను పలుమార్లు ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సీఎం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పట్టణాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ గల్లీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు పక్కా ప్రణాళికతో నిధులను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దార ప్రసాద్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, డీఈ రామకృష్ణ, ఎస్కే సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, ఉప్పుశెట్టి రాహుల్, యర్రంశెట్టి ముత్తయ్య, అనంతరాములు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


తాగునీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి..


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, అధికారులు

జూలూరుపాడు: నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈనెల 24న శనివారం వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సూచించారు. జూలూరుపాడు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో సింగరేణి సంస్థ సహకారంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ మేళాకు 80 సంస్థల బాధ్యులు హాజరుకానుండగా, ఐదు వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయని వెల్లడించారు. 7వ తరగతి ఫెయిల్ నుంచి డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ చదువుకున్న నిరుద్యోగులు హాజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ టి.శ్రీనివాస్, ఏఓ దీపక్ ఆనంద్, సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, ఎస్ఐ బాదావత్ రవి, ఎంపీఓ తులసీరామ్, ఐకేపీ ఏపీఎం సత్యనారాయణరాజు, కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచ: ఉపాధ్యాయులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం పాత పాల్వంచలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ తరగతులకు డీఎస్పీ హాజరై సైబర్ క్రైమ్, పోక్సో, మానవ రవాణా తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. మాట్లాడుతూ... టెక్నాలజీ పెరగడం వల్ల సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతిలో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. లాటరీ తగిలిందని, బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, సీబీఐ అధికారులమంటూ ఫోన్లు చేసి డబ్బులు కాజేస్తున్నట్లు చెప్పారు. సైబర్ నేరగాళ్ల వలలో పడితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని సూచించారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు పద్మలత, లెక్చరర్ డాక్టర్ శ్రీదేవి, సురేష్ బాబు, యడారి ప్రకాష్, పరమయ్య, కమలాకర్, జయబాబు పాల్గొన్నారు.

సాధన కొనసాగిస్తేనే శిక్షణకు సార్థకత


విద్యార్థులతో శిక్షకులు

ఇల్లెందురూరల్: శిబిరంలో నేర్చుకున్న అంశాలపై సాధన కొనసాగిస్తేనే శిక్షణకు సార్థకత ఉంటుందని ఎంఈఓ ఉమాశంకర్ అన్నారు. మండలంలోని 21పిట్ హైస్కూల్‌లో 15 రోజులు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడారు. వేసవిలో విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు ఆకర్షితులు కాకుండా ఆటపాటలు, విజ్ఞానం పెంచేలా పలు అంశాలపై ప్రభుత్వం శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిందని చెప్పారు. శిబిరంలో నేర్చుకున్న అంశాలను ఇక్కడితో వదిలేయకుండా నిరంతరం సాధన చేస్తూ వృద్ధి చేసుకోవాలని సూచించారు.

టేకులపల్లి: 6–9 తరగతుల విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో 15 రోజులు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఆటపాటలు, విద్య, డ్రాయింగ్, వ్యాయామం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. టేకులపల్లి, బోడు, సులానగర్ హైస్కూళ్లలో శిబిరాలు నిర్వహించారు.

పరామర్శ

సుజాతనగర్: సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం ఎంపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ వీరాపురం రామలక్ష్మణ్‌రావు కుటుంబాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని బుధవారం రాత్రి పరామర్శించారు. రామలక్ష్మణ్‌రావు తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండె హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

సుజాతనగర్: పంట మార్పిడి విధానం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా సీతంపేట బంజరలో పంట మార్పిడి విధానంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతులు అధిక దిగుబడులు పొందాలంటే వరి తర్వాత వరి, పత్తి తర్వాత పత్తి కాకుండా ఆరుతడి పంటలైన పెసర, మినుము, వేరుశనగ, నువ్వులు, బొబ్బర్లు తదితర పంటలను సాగు చేయాలన్నారు. తక్కువ కాలపరిమితి కలిగిన ఈ విధమైన పంటలను సాగు చేయడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్త శివ, ఉద్యానవన అధికారి స్రవంతి, ఏఈఓ ప్రనూష తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణమ్మ

సోలార్ కార్మికులకు వేతనాలు చెల్లించండి..

సింగరేణి(కొత్తగూడెం): దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుకున్న చందంగా మారింది... సింగరేణిలో కాంట్రాక్టర్ల పరిస్థితి. రామవరంశివారు ప్రాంతంలో 3 ఇంక్‌లైన్ వద్ద గల సోలార్ ప్లాంట్‌లో ఐదు నెలలుగా జీతాలు రాక స్టాఫ్, సెక్యూరిటీ, లేబర్ (గ్రాస్ కటింగ్) కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 45 మందికి అలమటిస్తున్నారు. ఈ విషయాన్ని ఏరియా ఇంజనీరు దృష్టికి తీసుకెళ్లినా అదిగో ఇస్తున్నాం.. ఇదిగో ఇస్తున్నాం.. అనికాలయాపన చేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టరు వేతనాలు ఇవ్వకపోతే ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా కంపెనీ వేతనాలు చెల్లించి, ఆ తరువాత కాంట్రాక్టరు బిల్లుల నుంచి వసూలు చేయాలనే డిప్యూటీ లేబర్ కమిషనర్ నిబంధనను అమలు చేయడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆత్మహత్యే శరణ్యమని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టుల జాతర రజతోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించుకుందామని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం కొత్తగూడెంలో పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ఈ నెల 31న హైదరాబాద్‌లో జరగనున్న జర్నలిస్టుల జాతర సంబురాలు విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు తరలిరావాలని పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే, టీజేఎఫ్ ఏర్పడి 25 ఏళ్లు పూర్తవుతున్నందున హైదరాబాద్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు జిల్లా నుంచి జర్నలిస్టు మిత్రులు పెద్ద ఎత్తున కదలిరావాలన్నారు. 2001 మే లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం యూనియన్ ఆవిర్భవించిందన్నారు. ఆనాడు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ముందుండి తెలంగాణ సాధించడంలో కీలక భూమిక పోషించిందని చెప్పారు. ఈసమావేశంలో మహమ్మద్ షఫీ, వట్టికొండ రవి, కాగితపు వెంకటేశ్వర్లు, అచ్చిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొట్టి నవీన్, రమేష్, యాకుబ్ పాషా, శేఖర్, రాము, ప్రవీణ్, దుర్గ, శ్యామ్,, మోటమర్రి రామకృష్ణ, శేఖర్, రాజశేఖర్, రాజ్‌కుమార్, అన్వర్, నాగరాజు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

దురలవాట్లకు దూరంగా ఉండాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు దురలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏరియా వర్క్‌షాపు డీవైఎస్ఈ ఏ.ఉపేందర్‌బాబు అన్నారు. ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్తగూడెం ఏరియా వర్క్‌షాపులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగరేణి సంస్థ కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తోందని, కానీ కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవటంలో అలసత్వం వహిస్తున్నారని తద్వారా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ లలిత మధుమేహం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉప్పు, చక్కెర తగ్గించి పండ్లు కూరగాయలు, తృణధాన్యాలు తీసుకోవాలని, పోటాషియం అధికంగా ఉండే అరటిపండ్లు, ఆకుకూరలు వంటివి ఆరోగ్యానికి మేలు చేస్తాయని, జాగింగ్, సైక్లింగ్ వంటివి చేయాలన్నారు. అదే విధంగా యోగా, ధ్యానం కచ్చితంగా చేయాలని, అధిక బరువు రక్తపోటుకు ప్రధాన కారణమని, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధుకృష్ణ, సత్తార్‌పాషా, నాగమోహన్, వెంకట్రావ్, రవి, కార్మికులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓబీ కార్మికులకు బోనస్ చెల్లించండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం రీజియన్ పరిధిలోని ఇల్లెందు ఏరియాకు చెందిన కోయగూడెం ఓపెన్ కాస్ట్ ఓబీ కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి ప్రకటించిన ఐదు వేల బోనస్ వెంటనే చెల్లించాలని బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ... కోయగూడెం ఓసీలోని బ్లాస్టింగ్, ఇతర పనులు చేస్తున్న 18 మందికి సింగరేణి ప్రకటించిన ఐదు వేల బోనస్ నేటికీ అందలేదని.. కార్మికులకు, కాంట్రాక్ట్ వర్కర్లకు చెల్లించిన బోనస్ వీరికి చెల్లించకపోవటం కారణమేమిటనని ప్రశ్నించారు. ఈ విషయమై కోయగూడెం అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. అధికారులు స్పందించి బోనస్ చెల్లించాలని లేదంటే ఓసీలో పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. నెమెళ్ల సంజీవ్, డి.ప్రసాద్, రత్నాచారి, లక్ష్మయ్య, శ్రీను, యాదగిరి వసంతరావు, భుక్యా శ్రీను పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక విప్లవ సృష్టికర్త రాజీవ్‌గాంధీ


ఇల్లెందులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, నాయకులు

ఇల్లెందు: భారతదేశానికి శాస్త్ర, సాంకేతిక రంగాన్ని విస్తరింపజేసిన సాంకేతిక విప్లవ సృష్టికర్త మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి బుధవారం ఇల్లెందు పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, దొడ్డా డానియేల్, పులి సైదులు, బోళ్ల సూర్యం, మండల రాము, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, శివకుమార్, జీవీ భద్రం , నందకిషోర్, ఎరసంగి వెంకన్న, సుదర్శన్ కోరీ, గోపగానీ రాజు, చెంచమ్మ, ఇమామ్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, కంచర్ల హరీష్, లకావత్ లచ్చు నాయక్, దుద్దుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: కూరగాయల మార్కెట్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్వాల శ్రీనివాసరావు, ఎడవల్లి కృష్ణ, కొండం వెంకన్న, నూకల రంగారావు, బాలినేని నాగేశ్వరరావు, యర్రంశెట్టి ముత్తయ్య, సాధం రామకృష్ణారావు, బాదర్ల జోషి, ఎస్ఏ.జలీల్, బద్ది కిషోర్, భువన సుందర్‌రెడ్డి, వెంకటాచారి, రాము, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టేకులపల్లి: రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టేకులపల్లి మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కోరం సురేందర్, దేవా, ఈది గణేష్, పోశాలు, రెడ్యా నాయక్, సర్దార్, పూన్యా, నర్సయ్య, అఫ్రోజ్, రవీందర్‌సింగ్, రవి, సంజయ్, గాంధీ పాల్గొన్నారు.

కొత్త బదిలీ విధానాన్ని రద్దు చేయాలి

- మానసిక వేదనకు గురవుతున్న కార్మికులు
- నిబంధనలు తొలగించాలని డిమాండ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులను మానసిక వేదనకు గురిచేస్తున్న కొత్త బదిలీ విధానాన్ని రద్దు చేయాలని కార్మికులు, కార్మిక సంఘాల నేతలు కోరుతున్నారు. సింగరేణి యాజమాన్యం ఇటీవల విడుదల చేసిన బదిలీ పూర్తిగా కార్మికుల అభ్యున్నతికి వ్యతిరేకంగా ఉందని, తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానంగా పర్చేజ్ డిపార్ట్‌మెంట్, కోల్ బ్రాంచ్, స్టోర్స్, రిక్రూట్‌మెంట్ సెల్ వంటి శాఖల్లో పనిచేసే ఉద్యోగులు కనీసం నాలుగు సంవత్సరాల తరువాత ఆ శాఖ నుంచి వేరే శాఖకు బదిలీ చేయాలన్న నిబంధనను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఈ విభాగాలలోల్ పనిచేసిన ఉద్యోగులను మళ్లీ ఈ విభాగంలో నియమించరాదన్న నిబంధన సరైంది కాదంటున్నారు. ఒక పర్మనెంట్ ఉద్యోగి ప్రతీ మూడేళ్లకోసారి తప్పకుండా బదిలీ చేయాలన్న విధానం గర్హనీయం అంటున్నారు. దీంతోపాటు ఉద్యోగి తన సర్వీసులో కేవలం రెండుసార్లు మాత్రమే రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ అవకాశం కల్పించటం, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ 10 సంవత్సరాలలోపు సంబంధిత ఏరియాలో పనిచేసిన అనుభవం ఉండాలన్న షరతులు సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కఠినంగా ఉన్నాయని వీటిని వెంటనే రద్దు చేయాలని కోరుతున్నారు.


భూగర్భ గనిలో పనిచేస్తున్న కార్మికులు

నిబంధనలు కఠినంగా ఉన్నాయి...



సింగరేణిలో యాజమాన్యం నూతనంగా షరతులు పెట్టి బదిలీ విధానానికి జీఓ విడుదల చేయటం సరైంది కాదు. ఇది కార్మికుల మనోవేదనకు గురిచేస్తుంది. సంస్థ ఉన్నతాధికారులు కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని చెబుతూ నూతన షరతులు అమలు సరికాదు. – జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ

కార్మికుల బదిలీ అవసరం లేదు...



సింగరేణిలో అధికారులను ప్రతీ మూడేళ్లకోసారి బదిలీ చేయాల్సి ఉంది. కానీ మర్రిచెట్టు ఊడల్లా ఒక్కొక్కరు 15 ఏళ్ల వరకు పనిచేస్తున్నారు. మరికొంత మంది జూనియర్ ఆఫీసర్‌గా ఎంపికై జీఎంలుగా ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ముందుగా ఈ విధానాన్ని మార్చాలి. – రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి

సీనియారిటీ ప్రకారం బదిలీ చేయాలి



ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కార్మికులను సీనియారిటీ ప్రకారం బదిలీ చేయాల్సి ఉండగా.. పైరవీ లేకుండా బదిలీ అయ్యే పరిస్థితి లేదు. కార్మికులు అధికారులను కలిసే అవకాశమే లేదు. ఒకవేళ ఉన్నా.. వారికి సరైన సమాధానం ఉండదు. ముందుగా ఈ విధానానికి స్వస్తి పలకాలి. – నర్సింహారావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి